గ్రామాల్లో బెల్టుషాపుల జోరు!

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రైవేట్ మద్యం పాలసీ కూటమి నేతలకు ఆదాయ వనరుగా మారింది. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. ఇళ్లు, చిల్లర కొట్లు, బజ్జీల దుకాణాలు, పొలాల వద్ద కూడా మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఫోన్ కాల్ చేస్తే మందుబాబుల వద్దకే మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30లు అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- పలమనేరు నియోజకవర్గంలో 212 బెల్టు షాపులు
- చిల్లరకొట్లు, బజ్జీల దుకాణాలు, ఇళ్లు, పొలాల వద్ద విక్రయాలు
- క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 అధికం
- బెల్టుషాపుల్లోనూ కల్తీ మద్యం అమ్మకాలు
- మత్తులో జోగుతున్న మందుబాబులు




పలమనేరు - కుప్పం రోడ్డులో చిల్లరకొట్లు, హోటళ్లలో వున్న మద్యం బాటిళ్లు, దుకాణంలో మద్యం సేవిస్తున్న మందు బాబులు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో మొత్తం 90 పంచాయతీలు, 500 వరకు గ్రామాలు వున్నాయి. వీటిలో మొత్తం 17 ప్రభుత్వ మద్యం దుకాణాలు వుండగా 212 బెల్టుషాపులు వున్నాయి. పలమనేరు రూరల్‌లో 12, గంగవరంలో 45, పెద్దపంజాణిలో 20, వి.కోటలో 30, బైరెడ్డిపల్లిలో ఏకంగా 100కు పైగా బెల్టుషాపులు నడుస్తున్నాయి. మద్యం షాపులు ఎక్కువగా కూటమి నేతలవే. వారు గ్రామాల్లో తమ వారిద్వారానే బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. గ్రామాల్లోని చిన్నపాటి కొట్లు, బజ్జీ దుకాణాలు, కొందరు ఇళ్ల వద్ద, మరికొందరు పొలాల వద్ద మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దుకాణాల్లో తెచ్చిన మద్యం క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీనికి తోడు వీరికి మద్యం షాపుల నిర్వాహకులు కావాల్సినంత సరుకును అప్పుగా ఇస్తున్నారు. సరుకు విక్రయించిన తర్వాతే డబ్బు తిరిగి ఇచ్చే వెసులుబాటు కల్పించారు. ఇక ఉదయం 10 గంటల లోపు, రాత్రి మద్యం షాపులు బంద్ చేశాక బెల్టు షాపుల్లో ధరలు మరింత ఎక్కువగా పెంచుతున్నారు.

బెల్టుషాపుల్లోనూ మద్యం కల్తీ

బెల్టుషాపుల్లో మద్యం కల్తీ యథేచ్ఛగా సాగుతున్నట్టు సమాచారం. మ్యాన్సన్ హౌస్, నెపోలియన్ తదితర బ్రాండుల బ్రాందీలోకి చీప్ లిక్కర్ కలుపుతున్నట్టు తెలిసింది. కొందరు కర్ణాటక మద్యం షాపుల్లో క్వార్టర్ టెట్రా ప్యాకెట్లను రూ.140లకే కొనుగోలు చేసి ఇక్కడి రూ.240ల క్వార్టర్ బాటిళ్లలో కల్తీ చేసి విక్రయిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దాబాలు, హోటళ్ళు, మారుమూల గ్రామాల్లో సైతం మద్యం 24 గంటలు అందుబాటులో ఉంటోంది. కల్తీ మద్యం తాగుతున్న మందుబాబులు మత్తులో జోగుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నారు. తద్వారా తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు.





గంగవరం మండలం అప్పినపల్లిక్రాస్‌లో బెల్టుషాపు, మద్యం షాపుల వద్ద మత్తులో మందుబాబులు

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పలమనేరు: తక్కువ వేతనంతో ఎక్కువ పనులు చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తీర్చాలని, లేదంటే నవంబరు 7న సమ్మెను పెద్ద ఎత్తున చేపడతామని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వాడ గంగరాజు హెచ్చరించారు. ఆయన శుక్రవారం కార్మికులతో కలిసి స్థానిక బాపూజీ పార్కులో నిరసన తెలిపి గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ తమ సమస్యను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే నిరసనలకు పిలుపునిచ్చామన్నారు. రఘు, మంజునాథ్, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సరుకుల వితరణ



సరుకులు అందజేస్తున్న శబరీష్

వి.కోట: పట్టణానికి చెందిన మెడికల్ స్టోర్ ఓనర్ కేఆర్ఎస్ శబరీష్ శుక్రవారం పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులు వితరణ చేశారు. దసరా పండుగ సందర్భంగా ఆయన తమ ఇంటిలో ఆయుధ పూజ చేశారు. ఈ క్రమంలో 40 మంది కార్మికులకు సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, ధీరజ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి ప్రింటర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు) : మండలంలో పనిచేస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన 27 మంది ఉపాధ్యాయులు శుక్రవారం పులిచెర్లలోని ఎమ్మార్సీకి ప్రింటర్ అందజేశారు. ఎంఈవోలు సిద్దరామయ్య, పోకల తాతయ్య మాట్లాడుతూ ఎమ్మార్సీలో ప్రింటర్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన ఉపాధ్యాయులు ఉచితంగా ప్రింటర్ అందజేశారని తెలిపారు.

ఘనంగా దసరా పండుగ

రొంపిచెర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా కార్యాలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజ చేసి టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, వీఆర్వోలు పల్లవి, శ్రీనివాసులు, సురేంద్ర, వీఆరోఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు



ఎంబీటీ రోడ్డులో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

పుంగనూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్మికులు ఎంబీటీ రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించి కంపోస్ట్ యార్డుకు తరలించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ఫాగింగ్ చేపట్టామన్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికను తొలగిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప, కార్మికులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రక్షణ గోడలు లేని వంతెన

పలమనేరు: మండలంలోని మండీపేటకోటూరు మార్గంలో తావడపల్లి–సముద్రపల్లి మధ్య కౌండిన్య నదిపై వంతెనకు ఇరువైపులా సేఫ్టీవాల్స్ లేవు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నది ఉధృతంగా ప్రవహిస్తోంది నీరు వంతెన వరకు వుంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర, ఇతర వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా నదిలోకి పడడం ఖాయం. ముఖ్యంగా ఈ వంతెనపై పలు కళాశాలలు, స్కూల్ బస్సులు వెళుతుంటాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా సేఫ్టీ వాల్స్ లేదా పిల్లర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన మహాసంప్రోక్షణ ఉత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కాశీవిశ్వేరస్వామి ఆలయంలో చేపట్టిన మహా సంప్రోక్షణ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈవో కమలాకర్ ఆధ్వర్యంలో అర్చకులు బాలసుబ్రమణ్యం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని జాంద్రపేటలో వెలసిన రామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రఘునాథ రావు ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు. విశేషాలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

బాలిక అదృశ్యం

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ రాజీవ్‌నగర్ సమీపంలోని ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఓ బాలిక శుక్రవారం అదృశ్యమైంది. నగరికి చెందిన ఆబాలిక ఇక్కడి కళాశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో ఉండేది. బాలిక కనిపించకపోవడంతో అక్కడి నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో బాలిక తండ్రి పలమనేరు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

బాలికలను సమానంగా చూడాలి



పలమనేరు : విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



పుంగనూరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



చౌడేపల్లె : మాట్లాడుతున్న సీడీపీవో రాజేశ్వరి



సదుంలో బహుమతుల పంపిణీ



రొంపిచెర్ల : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

పలమనేరు/పుంగనూరు/చౌడేపల్లె/సదుం/రొంపిచెర్ల : బాలికలను బాలురితో సమానంగా చూడాలని, అప్పుడే సమాజంలో లింగవివక్ష లేకుండా పోతుందని పలమనేరు సీఐ మురళీమోహన్ తెలిపారు. బాలికలు చదువుకోవడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని చౌడేపల్లె ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు తమ బాధ్యతను తీర్చుకునేందుకు చిన్నతనంలోనే పెళ్లి చేస్తుంటారని, అది మంచిది కాదన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలమనేరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో లీలారాణి, ఎంపీడీవో భాస్కర్, పుంగనూరు పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం నటరాజారెడ్డి, ఉపాధ్యాయులు, చౌడేపల్లెలో ఎంపీడీవో లీలామాధవి, ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, సూపర్‌వైజర్లు సులోచన, రాధమ్మ, సదుంలో ఏఎస్ఐ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, రొంపిచెర్లలో ఎంఈవో శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారి, ఇన్‌చార్జి హెచ్ఎం కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, ఎస్ఐవో సుధాకర్‌రెడ్డి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ హేమలత, అంగన్‌వాడీ టీచర్లు హసీనా, అలివేలు, సంపత్ కుమారి, లావణ్య పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి దారుణం




నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, పుంగనూరు : నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



చౌడేపల్లెలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శాంతిపురం/పుంగనూరు/చౌడేపల్లె: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని దారుణమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు తెలిపారు. వారు శుక్రవారం శాంతిపురం, పుంగనూరు, చౌడేపల్లెలో నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగా సమాజం పరిగణించాలని కోరారు. దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని కోరారు. శాంతిపురంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాదిగ, నియోకవర్గ కో ఇన్‌చార్జి వెంకటేష్ మాదిగ, మండల ఇన్‌చార్జి రవీంద్ర మాదిగ, నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు పాపన్న మాదిగ, పుంగనూరులో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు నరసింహులు, శ్రీనివాసులు, రమణ, సుబ్రమణ్యం, గోవిందు, చౌడేపల్లెలో పగడాల గోవిందు, నరసింహులు, ప్రభాకర్, రెడ్డెప్ప, మల్లికార్జున, సుబ్రమణ్యం, చిన్న సుబ్రమణ్యం, రవి, నాగరాజ, గంగాధర, ధనుంజయ, రామయ్య, నరేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఉధృతానికి దెబ్బతిన్న వంతెనలు




దండపల్లికి వెళ్లే రోడ్డులో కూలిన వంతెన, దెబ్బతిన్న డ్యామ్‌పై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

గంగవరం: మండలంలో కురుస్తున్న వర్షాలకు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కౌండిన్య నదీ ప్రవాహం ఉధృతం కావడంతో కొన్ని చోట్ల వంతెనలు, చెక్‌డ్యాంలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. వైఎస్సార్ జంక్షన్ నుంచి వెళ్లే దండపల్లి రోడ్డులో కౌండిన్య నదిపై నిర్మించిన వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ దారిలోనే అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తూ వుంటారు. వంతెన కూలిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే విధంగా మేలుమాయి క్రాస్ సమీపంలో కౌండిన్య నదిపై నిర్మించిన పాత చెక్ డ్యామ్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. డ్యాం దెబ్బతినడం, వర్షపు నీరు జోరుగా ప్రవహిస్తుండటంతో గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంతెనతో పాటు చెక్‌డ్యామ్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికులకు తిప్పలు



బస్సుల్లేక బోసిపోయిన పలమనేరు ఆర్టీసీ బస్టాండు

పలమనేరు: కర్నూలు జిల్లాలో నిర్వహించిన ప్రధాని మోదీ బహిరంగ సభ కోసం పలమనేరు, కుప్పం డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు పంపించారు. దీంతో రెండు రోజులుగా ప్రయాణికులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఇప్పటి వరకు జిల్లాతోపాటు పొరుగు జిల్లాల్లో సీఎం చంద్రబాబు సమావేశాలు జరిగాయంటే స్థానిక ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు వెళ్తుండేవి. ఇప్పుడు కర్నూలులో మోదీ సమావేశానికి సైతం ఇక్కడి నుంచి బస్సులను తరలించారు. దీంతో డిపోల్లో 80 శాతం బస్సులు లేకుండా పోవడంతో పలు మార్గాల్లో సర్వీసులు నడపలేని పరిస్థితి. పలమనేరు డిపోలో 59 సర్వీసులుండగా 41 బస్సులు పంపారు. కుప్పం డిపోలో 65 ఉండగా 45 బస్సులు కర్నూలుకు పంపారు. ఫలితంగా బస్సులు లేక ఆర్టీసీ బస్టాండ్లు బోసిపోయాయి. వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చిన గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలాగే పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఆటోల్లో వెళ్లాల్సి వచ్చింది. ఇదే అదునుగా కేఎస్ఆర్టీసీ బస్సులు పలమనేరులో స్టాపింగ్ లేకుండా డైరెక్ట్ టికెట్లకే ప్రాధాన్యతనిచ్చాయి. తిరుపతి నుంచి పలమనేరు, కుప్పం వైపు వచ్చే బస్సులు సైతం పలమనేరు స్టాపింగ్ లేదని, డైరెక్ట్ కుప్పం టికెట్లను మాత్రమే ఎక్కించుకున్నారు. ఇక తమిళనాడు బస్సుల్లో అసలు మార్గమధ్యంలో ఎక్కించుకోవడమే లేకుండా పోయింది. దీంతో ప్రజలు ఇదేం కూటమి పాలన సామీ అంటూ శాపనార్థాలు పెట్టడం కనిపించింది.

శ్రీకృష్ణదేవరాయలుకు ఘన నివాళి

సదుం: మండల కేంద్రమైన సదుంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి బలిజ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. రాయల కాలం ప్రజలకు స్వర్ణయుగమని కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించారు. ఆముక్తమాల్యద గ్రంథాన్ని తెలుగులో రచించి దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటారని తెలిపారు. రమేష్, రామయ్య, కృష్ణమూర్తి, గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..



పుంగనూరులో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నాయకులు

పుంగనూరు: పట్టణ సమీపంలోని భీమగానిపల్లె సర్కిల్‌లో వున్న శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం వద్ద శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని రాయల్ పీపుల్ ఫ్రంట్ నాయకులు జరుపుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మధుసూదన్‌రాయల్, నానబాలమణి, విజయ్‌కుమార్, రాఘవరాయల్, జనార్ధన్‌రాయల్, గోపిరాయల్, రమణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో 270 టీచర్ పోస్టులు ఖాళీ

- డీఎస్సీలోను భర్తీకాని టీచర్ పోస్టులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుప్పం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మొత్తం 684 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా వున్నాయి. దీంతో సకాలంలో సిలబస్ పూర్తికాకపోవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులను నియమించాలని పిల్లల తల్లిదండ్రులు పలుమార్లు విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. ఈ క్రమంలో నూతనంగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులను కేటాయిస్తామని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 414 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. ఇంకా కుప్పం మండలంలో 90, గుడుపల్లెలో 57, శాంతిపురంలో 62, రామకుప్పంలో 61 మొత్తం 270 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయి. అన్ని పోస్టులను భర్తీ చేస్తామని అధికారులు చెప్పారని, సుమారు 270 పోస్టులు ఖాళీగా వుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే పిల్లల చదువులు ఎలా కొనసాగుతాయని మండిపడుతున్నారు. ప్రధానంగా ఇద్దరు ఉండాల్సిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కరిని మాత్రమే నియమించారని వాపోతున్నారు. హైస్కూల్‌లో ఐదు ఖాళీలు ఉన్న చోట ముగ్గురిని, నాలుగు ఖాళీలు ఉన్న చోట ఇద్దరిని నియమించడం దారుణమని చెబుతున్నారు.

హోరా హోరీగా కబడ్డీ పోటీలు



చౌడేపల్లె : విజేతలతో ఉపాధ్యాయులు

చౌడేపల్లె: మండలంలోని చారాల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో భాగంగా పలమనేరు డివిజనల్ స్థాయి అండర్ 14, 17 కబడ్డీ పోటీలు హోరా హోరీగా జరిగాయి. ఇందులో 10 మండలాల నుంచి వచ్చిన 44 జట్లు తలపడ్డాయి. అండర్–17 బాలికల విభాగంలో చౌడేపల్లె విన్నర్స్‌గా, వి.కోట రన్నర్స్‌గా, అండర్ 17 బాలుర విభాగంలో సదుం విన్నర్స్‌గా, చౌడేపల్లె జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. అలాగే అండర్ 14 బాలికల విభాగంలో పలమనేరు విన్నర్స్, గంగవరం రన్నర్స్, అండర్ 14 బాలుర విభాగంలో పలమనేరు విన్నర్స్, వి.కోట రన్నర్స్‌గా నిలిచినట్లు హెచ్ఎం రేణుక, మండల కోఆర్డినేటర్ వెంకటేష్, పీఈటీ రాజేంద్ర తెలిపారు. అనంతరం బాలురు, బాలికల విభాగంలో డివిజినల్ స్థాయి జట్లను ఎంపిక చేశారు.

జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక

సదుం: చౌడేపల్లె మండలం చారాలలో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపినట్టు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అండర్ 17 విభాగంలో యోగేశ్, అండర్ 14 విభాగంలో వంశీ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను పాఠశాల బృందం అభినందించింది.

విద్యుత్ సర్వీసు కోసం మూడేళ్లుగా నిరీక్షణ




రామయ్యగట్లులో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోరు, ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటుచేసిన దిమ్మె

చౌడేపల్లె: గ్రామానికి తాగునీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన బోరుకు మూడేళ్లుగా విద్యుత్ సర్వీసు ఇవ్వడం లేదని ఆమినిగుంట పంచాయతీ రామయ్యగట్లు వాసులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ 22 ఎస్టీ కుటుంబాల వారు నివాసం వుంటున్నారు. వారికి తాగునీటిని అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడేళ్ల క్రితం బోరు, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. అధికారుల సూచనల మేరకు గ్రామంలోని ప్రతి ఇంటికీ రూ.150ల చొప్పున వసూలు చేసి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను సైతం ఏర్పాటుచేశారు. తర్వాత విద్యుత్ సర్వీసును ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరుకు విద్యుత్ సర్వీసుతోపాటు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.